క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కనిగిరి రూరల్: మున్సిపాలిటీలోని 2వ సచివాలయం శంఖవరంలో గురువారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొంటారన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరు కావాలని కోరారు.

కొండపి: మండలంలోని ఇలవర గ్రామంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బ్రహ్మయ్య తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ సచివాలయ అధికారులు, గ్రామ వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు ప్రారంభించాలి

కనిగిరి రూరల్: పంచాయతీల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆర్డీఓ, ప్రత్యేకాధికారి సందీప్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎన్‌ఆర్‌జీఎస్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సందీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క కూలీ చేత పనులు చేయించాలన్నారు. కూలీలకు సకాలంలో మస్టర్లు వేసి వేతనాలు వేసే విధంగా ఉపాధి సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీబీ మల్లికార్జునరావు, ఏపీఓ షారూన్ పుష్పరాణి, ఈసీ కిషోర్, టీఏలు, ఎఫ్ఏలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మినుముల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కందుకూరు: మినుముల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ సూచించారు. స్థానిక మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన మినుముల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కందుకూరులో మినుములు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కేంద్రం ఉపయోగపడుతుందని, బయట వ్యాపారుల వద్ద తక్కువ ధరకు అమ్ముకోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవచ్చని తెలిపారు. తుఫాన్ కారణంగా తడిసిన మినుములను కూడా నాణ్యతను బట్టి కొనుగోలు చేస్తామని తెలిపారు. మార్కెట్‌యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీనివాసులు, బడేవారిపాలెం పీఏసీఎస్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు..

ఉత్తమ బీఎల్వో అవార్డు అందుకున్న నరేంద్ర

టంగుటూరు: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా కొండపి నియోజకవర్గ ఉత్తమ బీఎల్వో అవార్డును మండలంలోని అనంతవరం పంచాయతీ కార్యదర్శి మక్కెన నరేంద్ర బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్రను పలువురు అభినందించారు.

58 మందికి కంటి పరీక్షలు

సింగరాయకొండ: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్ చైతన్యకృష్ణ నేతృత్వంలో బుధవారం అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు ఆర్ఎల్‌వీ చంద్రశేఖర్ 58 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 17వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, అవ్వాతాతలు సద్వినియోగం చేసుకుని ఉచితంగా కంటి అద్దాలు పొందాలని కోరారు. ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌అలీ, సీహెచ్‌వో సునీత, ఏఎన్ఎం భారతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ

టంగుటూరు: చెవిటితో బాధపడుతున్నారని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు దృష్టికి స్థానిక నాయకులు తీసుకురాగా, ఆయన స్పందించి వినికిడి యంత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. వరికూటి సూచనల మేరకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సింగరాయకొండ మండలం పాకల గ్రామానికి చెందిన రెనుమాల బ్రహ్మయ్యకు, మండలంలోని అనంతవరం పంచాయతీ పరిధిలోని పసుకుదురు గ్రామంలో మరో వ్యక్తికి బుధవారం వినికిడి యంత్రాలు అందజేశారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి హరిబాబు, బీనిడి ఉదయకుమార్ చేతుల మీదుగా వాటిని అందజేశారు. కార్యక్రమంలో పమిడి వీర రాఘవయ్య, మన్నం వెంకయ్య, సర్పంచి ఉప్పలపాటి శివరామరాజు, జిల్లా చంద్ర, దాసరి సుబ్బారావు, సత్యనారాయణరాజు, కొమ్ము బుజ్జి, కసుకుర్తి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ తృతీయ వార్షిక వేడుకలు

సీఎస్‌పురం: మండలంలోని జంగంవారిపల్లిలో పట్టాభి రామచంద్ర స్వామి తృతీయ వార్షిక వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ అయలావజ్జుల శివకుమార్ శాస్త్రి విశపు శ్రీహర్షశర్మ, అర్చకులు త్రిపాటి రామానుజాచారిలు ప్రత్యేక పూజలు చేశారు.

ఓటు హక్కు వజ్రాయుధం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ శోభిక



జరుగుమల్లి జెడ్పీ హైస్కూల్ వద్ద సీనియర్ ఓటరును సన్మానిస్తున్న అధికారులు



కనిగిరి ర్యాలీలో మాట్లాడుతున్న తహసీల్దార్ యు పుల్లారావు



పామూరులో అవగాహన ర్యాలీ



మద్దిపూడిలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



కందుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

కనిగిరి రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ యు పుల్లారావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఎంపీడీఓ జీవీబీ మల్లికార్జునరావు ఓటు హక్కు విలువను గూర్చి వివరించారు. ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు పిల్లి వెంకట రమణారెడ్డి, చిలకల శివరామిరెడ్డి, తమ్మినేని పెద్దిరెడ్డి, ఏఎస్సై ముల్లా, హెచ్ఎం సంజీవి, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పామూరు: ఓటు ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించి ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ బీఆర్ఎల్‌వీ ప్రసాద్, ఎంఈఓ రవీంద్రనాథ్ అన్నారు. జాతీయ ఓటర్లదినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల వద్ద నుంచి వైఎస్సార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. డీటీ పొన్నరుసు వెంకటేశ్వర్లు, ఆర్ఐ నరగా ప్రవీణ్, జీజేసీ ప్రిన్సిపాల్ గుత్తి రమణయ్య, సుధాకర్, బాలక్రిష్ణ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.హరిబాబు, ఎంపీడీఓ జీవీకేరావులు విద్యార్థులతో ఓటుకు నోటు ప్రజాస్వామ్యానికి చేటు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. ఎంఈఓ జి.పెద్దిరాజు, ఇన్‌చార్జి హెచ్‌ఎం బొప్పరాజు సుబ్బారావు, డీటీ కిషోర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం: ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీటీ మాధవరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఓటర్లతో సమావేశమై ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ఎంఈఓ జె.ప్రసాదరావు, ఆర్ఐ మల్లికార్జునరావు, వీరభద్ర వీరాంజనేయ మిఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ మూరం మొరార్జి, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు అటేలయ్య, పెగోగులపల్లి ఉప సర్పంచ్ మిరియం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

కొండపి: ఓటు హక్కు పొందిన ప్రతిఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిర్భయంగా వినియోగించుకోవాలని తహసీల్దార్ సింగారావు పిలుపునిచ్చారు. బుధవారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కొండపిలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, దానివల్ల వచ్చే ప్రయోజనాలు, ఓటుహక్కును ఎలా వినియోగించుకోవాలనే విషయాలను వివరించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఈడీటీ ప్రసన్నేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపూడిలో...

మద్దిపూడి: మద్దిపూడిలో బుధవారం 74వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో హైస్కూల్ నుంచి బొద్రాయి సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, అధికారులు మానవహారం నిర్వహించారు. భారతదేశ పౌరులమైన తామంతా ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రభావాన్ని నిలబెడతామని, ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి...

సింగరాయకొండ: ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. డీటీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటును సద్వినియోగం చేసుకుంటామని విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ ఇనకొల్లు శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మహిళా కానిస్టేబుల్ భారతి ఆధ్వర్యంలో విద్యార్థినులు ప్రతిజ్ఞ చేశారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామంటూ పీఎన్‌సీఏ డిగ్రీ కాలేజీలో కరస్పాండెంట్ పి.గీతారాణి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

జరుగుమల్లిలో...

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ షేక్ నయూమ్ 60 సంవత్సరాలు నిండిన సీనియర్ ఓటరును సన్మానించారు. ఎంపీడీవో రామకృష్ణ, ఏఎస్‌వో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కందుకూరు: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఓటర్ల దినోత్సవంలో సబ్‌కలెక్టర్ శోభిక మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఓటు ఆయుధం లాంటిదన్నారు. అనంతరం పలువురు సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సన్మానించారు. ఓటర్ల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డీఎస్పీ కండే శ్రీనివాసులు, తహసీల్దార్ సీతారామయ్య, మున్సిపల్ కమిషనర్ మనోహర్, పట్టణ ఎస్సై కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం: జాతీయ ఓటర్లు దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించి ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పులి రాఘవులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరు రూరల్: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత గురించి వివరించారు. విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.


విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

సీఎస్‌పురం: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఏఏ గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి, ఎంత మంది కూలీలు పనులకు వస్తున్నారు, మస్టర్లు వేసే విషయంలో ఏవైనా అక్రమాలు జరుగుతున్నాయా, బిల్లుల చెల్లింపులో పరిస్థితి ఎలా ఉంది తదితర వాటి గురించి సమీక్షించారు. పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు సకాలంలో మీటింగ్‌కు హాజరు కాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీల్డ్ వెరిఫికేషన్, మస్టర్లు సేకరణ, మస్టర్లు ఆన్‌లైన్ చేయించడం తదితరాలలో నిర్లక్ష్యం వహించిన పలువురు టెక్నికల్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీఓ సుబ్బారావు, ఈసీ శివన్నారాయణరెడ్డి, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణకు కృషి చేయాలి

పొన్నలూరు: సమాజంలోని ఆడపిల్లల సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రమాదేవి కోరారు. జాతీయ బాలికా వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పొన్నలూరు జెడ్పీ పాఠశాలలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడబిడ్డలను చదివిద్దాం.. బతికిద్దామనే నినాదంతో ప్రజలను చైతన్యం చేయాలన్నారు. రాష్ట్రంలోని మహిళల భద్రతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.అనూరాధ, పి.మధురవాణి, ఎస్‌కే గౌసియాబేగం, బి.మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ బీఎల్ఓగా జయలక్ష్మి



సీఎస్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న జయలక్ష్మి

ఉలవపాడు: రాష్ట్రస్థాయిలో ఉత్తమ బీఎల్‌ఓగా 230 పోలింగ్‌స్టేషన్ బీఎల్‌ఓ ఎం జయలక్ష్మి ఎంపికైంది. 100 శాతం ఫారమ్ 6బీ క్లెయిమ్స్ నమోదు చేసినందుకు ఈ పురస్కారానికి ఎంపికైంది. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి, చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఎంకే మీనా చేతుల మీదుగా పురస్కారం అందుకుంది. జయలక్ష్మిని తహసీల్దార్ మహ్మద్ హుసేన్, సర్వేయర్ శ్రీనివాసరావు, సిబ్బంది అభినందించారు.

డంపింగ్‌యార్డ్‌కు స్థల పరిశీలన



డంపింగ్‌యార్డ్ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

పామూరు: పామూరు గ్రామ పంచాయతీకి డంపింగ్ యార్డ్ కోసం మండలంలోని నుచ్చుపొద పంచాయతీ పరిధిలోని చిలకపాడు వద్ద సర్వే నంబర్ 6/1లో స్థలాన్ని తహసీల్దార్ బీఆర్ఎల్‌వీ ప్రసాద్, ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం నెల్లూరురోడ్‌లో ఉన్న డంప్‌యార్డ్‌ను మరో ప్రదేశంలోకి తరలించేందుకు ప్రత్యామ్నాయ స్థలం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, ఈఓఆర్డీ వి.బ్రహ్మానందరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షేక్.నాయబ్‌రసూల్, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఇర్రి క్రిష్టారెడ్డి, సర్వేయర్ వేణు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో గతంలో ఉన్న స్వామి విగ్రహం ప్రదేశంలో దాతల సహకారంతో గ్రానైట్ రాయితో తయారు చేసిన నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు దాతలు చందాలు వేసుకుని దాదాపు రూ.16 లక్షల ఖర్చుతో మహా బలిపురంలో గ్రానైట్ రాయితో స్వామి విగ్రహాన్ని తయారు చేయించి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఈ నెల 27 వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. నారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ముదుమాల నారాయణరెడ్డి పర్యవేక్షణలో పూజలచేశారు.

లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

గుడ్లూరు: ముందుపోతున్న లారీని వెనుక నుంచి మినీ లారీ ఢీ కొనడంతో మినీ లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని జాతీయ రహదారిపై తెట్టు–శాంతినగర్ గ్రామాల మధ్య మంగళవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు.. చెన్నై నుంచి రొయ్యల లోడుతో విజయవాడ వైపుకు వెళుతున్న మినీ లారీ శాంతినగర్ దాటగానే డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో అదుపు తప్పి ముందు పోతున్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది, దీంతో లారీ డ్రైవర్ రామచంద్రకు తీవ్ర గాయాలు కావడంతో కావలి వైద్యశాలకు తరలించారు. లారీ ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది.

రూ.60 వేల ఆర్థికసాయం

కందుకూరు అర్బన్: కందుకూరు అంకమ్మతల్లి దేవాలయంలో అర్చకులు రవి కుటుంబానికి రూ.60 వేల ఆర్థికసాయాన్ని ఆలయ పునఃనిర్మాణ కమిటీ సభ్యులు బుధవారం అందజేశారు. కమిటీ సభ్యుడు తల్లపనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్చకులు రవి కుమారుడు అనిల్ మరణించాడని, వారి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఎమ్మెల్యే సూచన మేరకు ఆర్థిక సాయం అందజేశామన్నారు.

సెల్‌టవర్ నిర్మాణంపై నిరసన

పామూరు: పామూరు అంకాళమ్మవీధి గడ్డమీద నివాసగృహాల సమీపంలో ఏర్పాటుచేయనున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కాలనీవాసులు బుధవారం నిరసన చేపట్టారు. సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని, టవర్ ఏర్పాటుతో సమీప నివాస గృహాలకు చెందిన ప్రజలు వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు.

ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం తప్పనిసరి



మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు

కనిగిరి రూరల్: ప్లాస్టిక్ ఫ్లెక్సీ, కవర్ల నిషేధం శుక్రవారం నుంచి పూర్తి స్థాయిలో అమలు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఫ్లెక్సీ దుకాణాల యజమానులకు, వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఫ్లెక్సీలను తయారు చేయడం, నిల్వ ఉంచినా జరిమానాలు విధిస్తామన్నారు. ప్లాస్టిక్ బ్యానర్లు, సింగిల్ యూజ్ కవర్ల నిషేధం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

వలేటివారిపాలెం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ రవికుమార్ బుధవారం తనిఖీ చేశారు. తొలుత పోలినేనిచెరువు ప్రాథమిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయుల పనితీరు రికార్డులను పరిశీలించారు. అనంతరం గురుకుపాలెం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కాకర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం సక్రమంగా పెడుతున్నారా లేదా పరిశీలించారు.

ఉల్లాసంగా ఆటల పోటీలు

హనుమంతునిపాడు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమంతుపాడు జిల్లా పరిషత్, మహమ్మదాపురం, వాలిచర్ల, సీతారాంపురం, ముప్పళ్లపాడు, నందనవనం, వాలిచర్ల ,పెద్దగొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల ఆటల పోటీలు నిర్వహించారు.కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన..!

- వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- నాగిరెడ్డిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



నాగిరెడ్డిపాలెంలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న అశోక్‌బాబు

పొన్నలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించి మూడున్నరేళ్లగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ నవరత్న పథకాల ద్వారా గ్రామాల్లోని నిరుపేద కుటుంబాలు లబ్ధిపొందడంతో వారి జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లను ఆయా పంచాయతీల్లో ప్రజలకు అందుబాటులో నిర్మించి కనీస మౌలిక వసతులను ప్రభుత్వం సమకూర్చిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అబద్ధపు హామీలిచ్చి రైతులు, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని చెప్పారు. కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో కనిపిస్తున్నాయన్నారు. జగనన్న కాలనీల ద్వారా ప్రజలకు సొంతింటి కలను నిజం చేస్తూ ఒకే చోట వందల కొద్దీ గృహాలను నిర్మిస్తూ సరికొత్త గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తోందని తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి, మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, మూలే కృష్ణారెడ్డి, కంటు కోటేశ్వరరావు, కంటు వెంకటేశ్వర్లు, గెంటినపల్లి చంద్రశేఖర్, నూతలపాటి శివనారాయణ, గుమ్మళ్ల బ్రహ్మయ్య, పల్లపోలు బాలకోటిరెడ్డి, పిల్లి తిరుపతిరెడ్డి, చేవూరి పద్మనాభరెడ్డి, ముప్పా కోటేశ్వరరావు, గొర్రెపాటి మహేష్, గడ్డం మాల్యాద్రి, గొల్లపూడి రవణయ్య, అధికారులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ , జెడ్పీటీసీలు

సీఎస్‌పురం: మండలాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులు సహకరించాలని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యుడు మేకల శ్రీనివాసులు అన్నారు. ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను మారుమూల ప్రాంతాలకు చేరవేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు ఎంఈఓ జె.ప్రసాదరావు తెలిపారు. ఇంటింటికీ త్రాగునీరు అందించేందుకు మండలంలోని 37 గ్రామాలకు రూ.20 కోట్లు నిధులు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ వై రమేష్ తెలిపారు. స్థానికంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలని, ఉద్యోగుల సౌకర్యార్థం సీఎస్‌పురం నుంచి కనిగిరికి, విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల సమయానికి కె.అగ్రహారం నుంచి పామూరుకు, ప్రయాణికుల సౌకర్యార్థం సీఎస్‌పురం నుంచి సీతారామపురంకు బస్ సౌకర్యం కల్పించాలని ఎంపీపీ, జెడ్పీటీసీ ఆర్టీసీ అధికారులను కోరారు. వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన వెంకటరెడ్డి, ఎంఈఓ జె.ప్రసాదరావు, సింగిల్‌విండో అధ్యక్షుడు పెరుగు సుబ్బరామయ్య, సర్పంచ్‌ల సంఘం జిల్లా కార్యదర్శి బొట్ల చిరంజీవి, ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ, డిప్యూటీ తహసీల్దార్ మాధవరావు, ఈఓపీఆర్డీ సుందరరామయ్య, వైద్యాధికారి మురళి, పశువైద్యాధికారి మునీర్, వ్యవసాయాధికారి కంచెం రాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజనీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే పేదల అభివృద్ధి

- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- నాగిరెడ్డిపాలెంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన 20 కుటుంబాలు



వరికూటి అశోక్‌బాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న టీడీపీ కార్యకర్తలు

పొన్నలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాల్లోని నిరుపేద ప్రజలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎస్టీ కాలనీకి చెందిన 20 కుటుంబాల టీడీపీ కార్యకర్తలు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వరికూటి అశోక్‌బాబు సమక్షంలో వారంతా వైఎస్సార్ సీపీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై నమ్మకంతోనే టీడీపీ నుంచి స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలు నేడు సంతోషంగా ఉన్నారన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు తమను ఓటర్లుగా చూశారు తప్ప ఎలాంటి సంక్షేమ పథకాలు అందించలేదన్నారు. తాము గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయకపోయినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు ఇళ్ల స్థలాలతో పాటు సంక్షేమ పథకాలు అందించారన్నారు. వరికూటి అశోక్‌బాబు తమకు పూర్తి భరోసా, ధైర్యం కల్పించారని, పేద ప్రజలకు అండగా నిలబడుతున్న విధానం నచ్చి వైఎస్సార్ సీపీలో స్వచ్ఛందంగా చేరామని వివరించారు. పార్టీలో చేరిన వారిలో 8వ వార్డు మెంబర్ ఇండ్లా శీనమ్మ, ఇండ్లా ప్రసాద్, కొమరగిరి సునీల్, ఐశ్వర్య, ఇండ్లా సాయికుమార్, జాన్సీ, కొమరగిరి మాధవరావు, లక్ష్మీతిరుపతమ్మ, కొమరగిరి మాల్యాద్రి, వరలక్ష్మి, ఇండ్లా కొండయ్య, ఏసురాజ్యం, ఈసం కిరణ్‌కుమార్, నీలవేణి, ఇండ్లా మాధవరావు, సురేఖ, ఈసం వెంకటేశ్వర్లు, దొరసానమ్మ, ఇండ్లా అంకయ్య, పోలమ్మ, కొమరగిరి అంకయ్య, పద్మ, పోట్లూరి చెంచయ్య, శ్రావణి, తలపల చిన్నా, దుర్గా, రాపూరి శివయ్య, లక్ష్మి, మల్లవరపు శాంతి, వెంకటరమణ, రాపూరి సంజీవయ్య, పోట్లూరి వినోద్, కావ్య, ఇండ్లా దుర్గాప్రసాద్, నారాయణమ్మ, పోట్లూరి వేణు, కీర్తన, కొమరగిరి బాబు, వరలక్ష్మి కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, మూలే కృష్ణారెడ్డి, కంటు కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, గెంటినపల్లి చంద్రశేఖర్, నూతలపాటి శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.